ఎంజీఆర్, జయ కీర్తి అజరామరం...

రాష్ట్ర మాజీ సీఎంలు ఎంజీఆర్, జయలలిత ప్రజలకు చక్కటి పాలనను అందించారని, తాను శ్రీలంక పర్యటనకు వెళ్ళినప్పుడు ఎంజీఆర్ పూర్వీకుల నివాసగృహాన్ని కూడా తిలకించానని మోదీ తెలిపారు. డీఎంకే పాలకుల్లా కుటుంబ రాజకీయాల ద్వారా ఎంజీఆర్ అధికారంలోకి రాలేదని, స్వశక్తితో, అపారమైన జన విశ్వాసంతో అధికారంలోకి వచ్చారని ప్రశంసించారు. ఎంజీఆర్ బాటలోనే పయనించిన అమ్మ జయ కూడా ఎన్నో ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. ప్రస్తుత డీఎంకే పాలకులు ఎంజీఆర్, జయలలిత కీర్తి ప్రతిష్ఠలను దిగజార్చేందుకు ప్రయత్నిస్తుండటం గర్హనీయమని అన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలనే తలంపుతోనే డిఫెన్స్ కారిడార్‌ను ఏర్పాటు చేశామని, త్వరలో యుద్ధ పరికరాలు తయారీ జరగనుందని తెలిపారు. రాష్ట్రంలో రూ.20 వేల కోట్లతో జౌళి పార్కును ఏర్పాటు చేస్తున్నామని, దీనితో రాష్ట్రానికి రూ.2లక్షల కోట్ల మేరకు రాబడి పెరుగుతుందన్నారు.

450 సీట్లతో మళ్లీ మోదీ పాలనే....

కేంద్రమంత్రి ఎల్.మురుగన్ స్వాగతోపన్యాసంతో ప్రారంభమైన ఈ సభలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ప్రసంగిస్తూ... లోక్‌సభ ఎన్నికలకు ఇక అరవై రోజులే మిగిలి ఉందని, పార్టీ శ్రేణులంతా శ్రమించి 39 నియోజకవర్గాలలో పార్టీ అభ్యర్థులను గెలిపించాలని, అప్పుడే 450 సీట్లలో గెలిచి మూడోసారి అధికారంలోకి వచ్చిన ప్రధానిగా మోదీ కీర్తి పెరుగుతుందన్నారు. బీజేపీ నేతలు హెచ్ రాజా, పొన్ రాధాకృష్ణన్ నయినార్ నాగేంద్రన్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి, అరవింద్ మేనన్, కో ఇన్‌ఛార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి, మహిళా మోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే వానతి శ్రీనివాసన్, టీఎంసీ అధినేత జీకే వాసన్, పుదియనీది కట్చి అధినేత ఏసీ షణ్ముగం, తమిళనాడు మక్కల్ మున్నేట్ర కళగం నాయకుడు జాన్ పాండ్యన్, ఐజేకే నాయకులు టీఆర్ పారివేందర్, రవి పచ్చ ముత్తు పాల్గొన్నారు.



నరేంద్రమోదీకి జ్ఞాపికను బహూకరిస్తున్న రాష్ట్ర నేతలు

లోక్‌సభ ఎన్నికల తర్వాత

రాష్ట్రంలో రాజకీయ మలుపు

పల్లడం సభలో ప్రధాని మోదీ

చెన్నై, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల తర్వాత రాష్ట్ర రాజకీయాల్లో పెనుమార్పులు సంభవించడం ఖాయమని, తమిళ ప్రజానీకాన్ని దోచుకునేందుకు ప్రయత్నిస్తున్న ఇండియా కూటమికి గుణపాఠం చెప్పి, బీజేపీకి పట్టంగట్టేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై 'ఎన్ మణ్... ఎన్ మక్కల్' పేరుతో నిర్వహించిన పాదయాత్ర ముగింపు వేడుకల సందర్భంగా మంగళవారం సాయంత్రం తిరుప్పూరు జిల్లా పల్లడం సమీపం మాదాపురంలో ఏర్పాటైన బహిరంగసభలో ఆయన ప్రసంగిస్తూ... కొంగుమండలంలో భాగమైన తిరుప్పూరు జిల్లాలో పర్యటించడం తనకెంతో ఆనందంగా ఉందని, ఈ ప్రాంతమంతా జౌళి పరిశ్రమలకు ప్రత్యేక హబ్‌గా ఉంటూ దేశ ఆర్థిక పురోగతికి దోహదపడుతోందన్నారు. అన్నామలై పాదయాత్ర రాష్ట్రంలో కొత్త చరిత్రకు నాంది పలకనుందన్నారు. 1991లో కన్నియాకుమారి నుంచి నిర్వహించిన ఏక్‌తా యాత్రలో తాను పాల్గొన్నానని, ఆ సమయంలో కశ్మీర్‌లోని లాల్‌చౌక్ వద్ద జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని, కశ్మీర్‌కు ప్రత్యేక స్వయంప్రతిపత్తిని కలిగించే ఆర్టికల్ 370ని రద్దు చేయాలని ఆశించానని, ఆ కోరిక తాను అధికారంలోకి వచ్చాకే నెరవేరాయన్నారు. తమిళ భాష ఔన్నత్యాన్ని, తమిళుల సంస్కృతీ సంప్రదాయాలను ప్రపంచవ్యాప్తంగా తాను విస్తృత ప్రచారం చేస్తుండటం వల్లే రాష్ట్రంలోని డీఎంకే పాలకులు తనపై ఆగ్రహంతో ఉన్నారని తెలిపారు. తన నియోజకవర్గమైన కాశీలో తమిళ్‌సంగమం ఏర్పాటు తర్వాత తమిళ భాష కీర్తి ఉత్తరాదిలోనూ వ్యాపించిందన్నారు. కొత్త పార్లమెంట్ భవనంలో సెంగోల్ ప్రతిష్ఠించి తమిళుల సంస్కృతిని ఎలుగెత్తి చాటానని చెప్పారు. తమిళ ప్రజలు రాష్ట్రంలో బీజేపీ అధికారంలో లేకపోయినా కేంద్రంలో మళ్ళీ అధికారంలోకి రావాలని ఆశిస్తున్నారని తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి యూపీఏ విడుదల చేసిన నిధుల కంటే మూడింతలు ఎన్డీయే మంజూరు చేసిందన్నారు. రాష్ట్రంలో 3.5 కోట్ల మందికి ఉచిత బియ్యాన్ని అందిస్తున్నామని, 40 లక్షల మందికి ఉచిత గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేశామని, పీఎం ఆవాజ్ యోజన పథకం కింద రాష్ట్రంలో 6లక్షల మందికి ఇళ్ళను నిర్మించి ఇచ్చింది కూడా తమ ప్రభుత్వమేనన్నారు.

అపూర్వ స్వాగతం...

సభావేదిక ప్రాంతంలో ప్రధాని మోదీకి పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన ప్రత్యేక వాహనం నడుమ మోదీ నిలిచి పార్టీ శ్రేణులకు అభివాదం తెలిపారు. సుమారు కిలోమీటర్ దూరం వరకూ ఆ వాహనంలో మోదీ ఊరేగింపుగా నాలుగు గంటలకు బహిరంగ వేదిక వద్దకు చేరుకున్నారు. పార్టీ ప్రముఖులు మోదీని గజమాలతోను, 65 కేజీలబరువు పసుపు మాలతోను సత్కరించారు. ఆ సమయంలో బీజేపీ రాష్ట్ర వ్యవహారాల కో-ఇన్‌ఛార్జి పొంగులేటి సుధాకర్ రెడ్డి 'మోదీ కావాలి...మళ్ళీ మోదీ రావాలి అంటూ తమిళంలో పెద్దయెత్తున నినాదాలు చేశారు.

భారీ భద్రతా ఏర్పాట్లు...

పల్లడం బహిరంగ సభలో పాల్గొనే నిమిత్తం ప్రధాని మోదీ రాక సందర్భంగా సుమారు 4500 మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు తిరువనంతపురం నుంచి విమానంలో బయలుదేరి 2.30 గంటలకు కోయంబత్తూరు సూలూరు వైమానిక స్థావరానికి చేరుకున్నారు. మధ్యాహ్నం 2.45 గంటలకు సూలూరు నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 3.30 గంటలకు మాదాపూరు మైదానం వద్దకు చేరుకున్నారు. 1400 ఎకరాల్లో ఐదు లక్షలమంది పాల్గొనేందుకు ఏర్పాటు చేసిన సభలో పాల్గొనేందుకు మంగళవారం ఉదయం 10 గంటల నుండే తిరుప్పూరు, కోయంబత్తూరు, సేలం, ఈరోడ్ తదితర జిల్లాల నుండి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. 1.12 వేల చదరపుటడుగుల విస్తీర్ణంలో మూడు చోట్ల వంటశాలలు ఏర్పాటు చేసి, పార్టీ శ్రేణులకు ప్రజలకు వివిధ రకాల ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. మంచినీటిని నిరంతరాయంగా సరఫరా చేశారు. మధ్యాహ్న భోజనం ముగిసిన తర్వాత బహిరంగ సభ్రపారంభమైంది. సభాస్థలి వద్ద 10 అగ్నిమాపక యంత్రాలు, 30 అంబులెన్స్‌లు సిద్ధంగా ఉంచారు. ప్రత్యేక వైద్య బృందాలను ఏర్పాటు చేశారు. సభా వేదికను దక్షిణాభిముఖంగా 80 అడుగుల పొడవు 60 అడుగులు వెడల్పుతో సభా వేదికను రూపొందించారు. వేదిక పైభాగాన బీజేపీ చిహ్నం తామరపుష్పం ఆకారంతో ప్రత్యేక సెట్టింగ్‌ను కూడా ఏర్పాటు చేశారు. 'మోదీ కావాలి... మళ్ళీ మోదీ రావాలి' అంటూ తమిళంలో ఆ తామరపుష్పంపై నినాదాన్ని కూడా రాసి ఉంచారు.

మదురైలో...

బహిరంగ సభ ముగియగానే పల్లడం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరిన మోదీ 5 గంటలకు మదురైకి చేరుకున్నారు. మదురై వీరపాంచాన్‌లోని ప్రైవేటు పాఠశాల వద్ద నిర్మించిన హెలిప్యాడ్‌లో దిగారు. ఆ పాఠశాల మైదానంలో ఎంఎస్ఎంఈలకు చెందిన పారిశ్రామికవేత్తలతో భేటీ అయ్యారు. కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలో స్టార్ట్ అప్ పథకాలు సబ్సిడీ, రుణ సదుపాయం, ఎంఎస్ఎంఈల అభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమం ముగియగానే శివగంగ రోడ్డు, రింగ్ రోడ్డు, కప్పలూరు మీదుగా తిరునగర్ సమీపంలో ఉన్న పసుమలైలోని స్టార్ హోటల్‌లో కాసేపు విశ్రాంతి తీసుకున్నారు. ఆ తర్వాత అక్కడి నుండి కారులో బయలుదేరి పసుమలై, పళంగానత్తం, తిరుప్పరంకుండ్రం రోడ్డు, దక్షిణ వెండి వీధి మీదుగా మదురై మీనాక్షి అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. ఆ తర్వాత స్వామిఅమ్మవార్ల సన్నిధులను దర్శించారు. ఆలయంలో స్వామి అమ్మవార్లకు నిర్వహించిన శయన పూజలలోనూ ఆయన పాల్గొన్నారు. మోదీ రాక సందర్భంగా ఆలయం చుట్టూ ఉన్న అన్ని ప్రాంతాల్లో పోలీసులు మెటల్ డిటెక్టర్లతో, జాగిలాలతో తనిఖీలు నిర్వహించారు. మోదీ రాకను పురస్కరించుకుని సాయంత్రం 4.30 నుండి ఆలయంలో భక్తులను దర్శనానికి అనుమతించకుండా కట్టుదిట్టం చేశారు.



ప్రధాని మోదీ బస చేసిన మదురై పసుమలై స్టార్ హోటల్ వద్ద కాపలా కాస్తున్న పోలీసులు

నేడు రూ.17,300 కోట్ల పథకాలకు మోదీ శంకుస్థాపన...

ప్రధాని నరేంద్రమోదీ బుధవారం ఉదయం తూత్తుకుడిలో ఏర్పాటయ్యే సభలో రూ.17,300 కోట్లతో రాష్ట్రానికి సంబంధించిన అభివృద్ధి పథకాలకు శంకుస్థాపన చేయనున్నారు. తూత్తుకుడి వా.వు. చిదరంబరనార్ హార్బర్‌లో గూడ్స్ టెర్మినల్‌కు, దేశంలోనే తొలిసారిగా గ్రీనరీ హైడ్రోజెన్ హార్బర్‌గా మార్చేదిశగా సముద్రపునీటిని మంచినీరుగా మార్చే పథకానికి శంకుస్థాపన చేస్తారు. స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో తయారైన హైడ్రోజెన్ ఇంధనంతో నడిచే నౌకను ప్రారంభించనున్నారు. వాంచి మణియాచ్చి - నాగర్‌కోవిల్ రైలు మార్గం, వాంచి మణియాచ్చి - తిరునల్వేలి జంక్షన్ విభాగం, మేల్‌పాళయం - ఆరల్‌వాయ్‌మొళి విభాగం సహా డబ్లింగ్ రైలు మార్గాల నిర్మాణ పథకాలను ప్రారంభించనున్నారు. రూ. 1477 కోట్లతో నిర్మించిన ఈ డబ్లింగ్ రైలు మార్గాల ద్వారా కన్నియాకుమారి, నాగర్‌కోవిల్ నుండి చెన్నైకి వెళ్లే రైలు ప్రయాణికులు ప్రయాణ సమయాన్ని బాగా తగ్గించనుంది. రాష్ట్రానికి చెందిన నాలుగు రహదారుల పథకాన్ని కూడా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలోనే పది రాష్ట్రాలు, యూనియన్ ప్రదేశాలలో ఉన్న 75 లైట్ హౌస్‌లలో ఏర్పాటు చేసిన పర్యాటక సదుపాయాలను కూడా మోదీ ప్రారంభించనున్నారు. ఆ తర్వాత ఉదయం 11.15 గంటలకు తిరునల్వేలిలో జరిగే బీజేపీ బహిరంగ సభలో పాల్గొని ఆయన ప్రసంగించనున్నారు.

కాంగ్రెస్‌కు ఐదు స్థానాలే!

- తేల్చి చెప్పిన డీఎంకే
- అధిష్ఠానాన్ని శరణుజొచ్చిన టీఎన్‌సీసీ

చెన్నై, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): 'ఇండియా' కూటమిలో క్రియాశీలకంగా వున్న కాంగ్రెస్ - డీఎంకే మధ్య సీట్ల సర్దుబాటు వ్యవహారం అసంతృప్తి సెగలు పుట్టిస్తోంది. గత లోక్‌సభ ఎన్నికల్లో ఇచ్చిన స్థానాల కన్నా ఈ సారి కొన్నింటిని తగ్గిస్తామంటూ కాంగ్రెస్‌కు డీఎంకే చెప్పడమే ఇందుకు కారణంగా కనిపిస్తోంది. డీఎంకే కూటమిలో కొంగునాడు మక్కల్ కట్చి, ఐయూఎంఎల్‌లకు ఇప్పటికే డీఎంకే చెరొక స్థానం కేటాయించిన విషయం తెలిసిందే. అదే సమయంలో గతంలో ఒక్క స్థానంలో పోటీ చేసిన ఎండీఎంకే ఈ సారి రెండు స్థానాలను, గతంలో రెండేసిచోట్ల పోటీ చేసిన వామపక్షాలు ఇప్పుడు చెరి మూడు స్థానాలను, గతంలో రెండు స్థానాల్లో పోటీ చేసిన డీపీఐ ఈసారి 4 స్థానాలను అడుగుతోంది. దాంతో డీఎంకే కూటమి చర్చల్లో స్తంభన నెలకొంది. గత 2019 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ కన్నియాకుమారి, విరుదునగర్, తిరుచ్చి, ఆరణి, తిరువళ్లూరు, కృష్ణగిరి, తేని, శివగంగ, కరూర్, పుదుచ్చేరి కలిపి మొత్తం పది స్థానాల్లో పోటీ చేసిన కాంగ్రెస్ తొమ్మిందింటిలో విజయం సాధించగలిగింది. తేని నియోజకవర్గంలో ఆ పార్టీ పరాజయం పాలైంది. ఆ ఎన్నికల్లో డీఎంకే కూటమి నుంచి పోటీ చేసిన పార్టీలన్నీ వందకు వందశాతం విజయం సాధించగా, కాంగ్రెస్ మాత్రమే వెనుకబడిపోయింది. దీంతో ఆ పార్టీకి కూటమిలో స్థానాల సంఖ్య తగ్గించి, తమకు కేటాయించాలంటూ అన్ని పార్టీలు డీఎంకేని డిమాండ్ చేస్తున్నాయి. ఆ పార్టీలో నాయకత్వలోపం, సరైన అభ్యర్థుల్లేకపోవడం తదితరాల నేపథ్యంలో కాంగ్రెస్‌కు స్థానాలు తగ్గించడమే మేలని డీఎంకే కూడా భావిస్తోంది. దాంతో ఆ పార్టీకి ఐదు స్థానాలు మాత్రమే ఇస్తామని డీఎంకే స్పష్టం చేసినట్లు తెలిసింది. అంతేగాక తిరునల్వేలి, కన్నియాకుమారి, తిరుచ్చి, తంజావూరు, మైలాడుదురై, కడలూరు, కాంచీపురం, తిరువళ్లూరు, ఆరణి, అరక్కోణం నియోజకవర్గాల్లో ఐదింటిని ఎంపిక చేసుకోవాలని తేల్చిచెప్పింది. బయటకు 12 స్థానాలు కావాలని అడుగుతున్నప్పటికీ గతంలో ఇచ్చిన పది స్థానాలను కేటాయించినా చాలని భావిస్తున్న కాంగ్రెస్‌కు డీఎంకే చేసిన సూచన దిగ్భ్రాంతికి గురి చేసింది. దీంతో ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోవాలంటూ కాంగ్రెస్ రాష్ట్ర నేతలు తమ అధిష్ఠానాన్ని శరణుజొచ్చారు. టీఎన్‌సీసీ అధ్యక్షుడు పెరుందగై నేతృత్వంలోని సీనియర్లు సోమవారమే ఢిల్లీ వెళ్లి ఏఐసీసీ నేతలు ఏఐసీసీ నేతలు వేణుగోపాల్, ముకుల్ వాస్నిక్‌తో భేటీ అయి విషయం వివరించారు. అంతేగాక మంగళవారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో భేటీ అయి డీఎంకే వ్యవహారంలో జోక్యం చేసుకోవాలంటూ అభ్యర్థించినట్లు తెలిసింది. దీంతో ఈ విషయాన్ని రాహుల్‌గాంధీ దృష్టికి కూడా తీసుకెళ్లాలని ఖర్గే భావిస్తున్నట్లు సమాచారం. కాగా ఈ వ్యవహారం రెండు పార్టీల్లోనూ ఉత్కంఠ రేపుతోంది. ఒకవేళ డీఎంకే తన నిర్ణయం మార్చుకోకపోతే.. కాంగ్రెస్ తగ్గకపోతే పరిస్థితి ఏంటన్నదానిపై రాజకీయవర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. అయితే ఓ కాంగ్రెస్ సీనియర్ నేత మాత్రం ఇదంతా టీకప్పులో తుఫాను లాంటిదని, కూటమిలో సీట్ల సర్దుబాటు సాఫీగా ముగుస్తుందని చెప్పడం గమనార్హం.





లోకేశ్‌కు అపూర్వ స్వాగతం

- రామానుజర్ ఆలయంలో ప్రత్యేక పూజలు

చెన్నై, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, యువనేత నారా లోకేశ్‌కు నగరంలో అపూర్వ స్వాగతం లభించింది. ఒక్కరోజు పర్యటన కోసం మంగళవారం ఉదయం 8.40 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో చెన్నై విమానాశ్రయం చేరుకున్న లోకేశ్‌కు టీడీపీ చెన్నై అధ్యక్షుడు చంద్రశేఖర్, టీటీడీ చెన్నై సమాచారకేంద్ర సలహామండలి మాజీ అధ్యక్షుడు, ప్రముఖ ఆడిటర్ నూతల పాటి శ్రీకృష్ణ, గంగాధరనెల్లూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి థామస్, సత్యవేడు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ హెలెన్, టీడీపీ సీనియర్ నేతలు జనార్ధన్, చలపతి, రాజేష్ తదితరులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి రోడ్డుమార్గంలో కాంచీపురం జిల్లా శ్రీపెరుంబుదూర్‌కు వెళ్లిన లోకేశ్... అక్కడున్న రామానుజర్ ఆలయానికి చేరుకున్నారు. అక్కడ అన్నానగర్ ఎమ్మెల్యే ఎంకే మోహన్, నగరి టీడీపీ అభ్యర్థి గాలి భాను ప్రకాష్, చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు పులివర్తి నాని, టీడీపీ సీనియర్ నేత రామాంజనేయులు, పార్టీ అభిమానులు, ఆలయ నిర్వాహకులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం సంప్రదాయం ప్రకారం స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించిన లోకేశ్.. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు లోకేశ్‌కు తీర్థప్రసాదాలు, జ్ఞాపికను బహూకరించారు. ఆలయ గజరాజు ఆశీస్సులు కూడా అందుకున్న ఆయన.. అక్కడికి తరలివచ్చిన టీడీపీ అభిమానులు, కార్యకర్తలతో ఫొటో దిగారు. అక్కడి నుంచి రోడ్డుమార్గం ద్వారా చెన్నై విమానాశ్రయం చేరుకున్న లోకేశ్... 12.30 గంటల ప్రాంతంలో ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా ఉండవల్లికి బయలుదేరి వెళ్లారు. ఆద్యంతం ఆయన వెంట టీడీపీ చెన్నై అధ్యక్షుడు చంద్రశేఖర్ ఉండి ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఇదిలా వుండగా టీడీపీ అధినేత నారా చంద్రబాబు సతీమణి భువనేశ్వరి కూడా త్వరలో రామానుజుల వారి ఆలయ దర్శనకు రానున్నట్లు తెలిసింది.



ఆలయం వద్ద లోకేష్‌ను చుట్టుముట్టిన ప్రముఖులు, అభిమానులు



లోకేష్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న ఎన్.శ్రీకృష్ణ



లబ్ధిదారులకు నష్టపరిహారం అందజేస్తున్న మంత్రి సుబ్రమణ్యం

విధి నిర్వహణలో మృతి చెందిన వైద్యుల వారసులకు రూ.7 కోట్ల పంపిణీ

అడయార్, ఫిబ్రవరి 27: విధి నిర్వహణలో ఉండ గా, ఏదేని ప్రమాదాల్లో మృతి చెందిన వైద్యుల కుటుంబాలను ఆదుకునేందుకు వీలుగా సంక్షేమ నిధి నుంచి ఏడు కుటుంబాలకు రూ.7 కోట్లను అందజేసినట్టు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం తెలిపారు. ఆయన మంగళవారం స్థానిక తేనాంపేటలోని డీఎంఎస్ ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడుతూ... విధి నిర్వహణ, ఏదేని ప్రమాదాల్లో మృతి చెందే వైద్యుల కుటుంబాలను ఆదుకునేందుకు 2020నుంచి సంక్షేమ నిధి పథకాన్ని ప్రారంభించామన్నారు. ఇందులో వైద్యులు తమ ఇష్టపూర్వకంగా చేరవచ్చన్నా రు. గత 2020లో ప్రారంభించిన ఈ పథకంలో 2020, 2021 సంవత్సరాలకు ఒక్కో వైద్యుడు రూ.6 వేల చొప్పున చెల్లించారన్నారు.ఈనిధి నుంచి మృతు డి కుటుంబానికి అందజేసే మొత్తాన్ని రూ.50 లక్షల నుంచి రూ.కోటికి పెంచుతూ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆదేశాలు జారీ చేశారన్నారు. ఆ తర్వాత 2022 మార్చి నుంచి అనేక మంది వైద్యులు తమ వేతనంలో రూ.500 చెల్లిస్తున్నారని పేర్కొన్నారు.ఈ పథకం కింద ఇప్పటివరకు 2 వేల మంది వైద్యులు చేరగా, కొత్తగా మరో 11వేలమంది వైద్యులు చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. వీరి వేతనంలో ప్రతి నెలా రూ.500 చొప్పున డెబిట్ చేసి, సంక్షేమ నిధిలో జమ చేస్తారన్నారు. 2022లో విధులు నిర్వహిస్తూ మృతి చెందిన ఏడుగురు వైద్యుల కుటుంబాలకు రూ.7 కోట్ల సాయం అందజేశామన్నారు. ఈ తరహా పథకం దేశంలో ఎక్కడా అమలు కావడం లేదన్నారు. అంతేకాకుండా, ప్రభుత్వ ఉద్యోగస్తులు సర్వీసులో ఉండగా చనిపోతే వారి వారసులకు కారుణ్య నియామకం కింద వారి విద్యార్హతకు అనుగుణంగా ఉద్యోగం ఇస్తున్నామని మంత్రి సుబ్రమణ్యం తెలిపారు.

పాలారుపై ఆనకట్ట ఎలా కడతారు?

- సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకం
- నీటి పారుదల మంత్రి దురైమురుగన్ ఆగ్రహం



చెన్నై, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పాలారు నదిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆనకట్ట నిర్మించేందుకు చేస్తున్న ప్రయత్నాలు సుప్రీంకోర్టు తీర్పునకు వ్యతిరేకమని తమిళనాడు రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి దురైమురుగన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కుప్పంలో సోమవారం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి పాలారు ప్రాజెక్టు నిర్మాణానికి అన్ని పాలనా అనుమతులూ ఇచ్చేశామని ప్రకటించిన నేపథ్యంలో తమిళనాడులో కొందరు నిరసన ప్రకటనలు చేస్తున్నారు. మూడు చెక్‌డ్యాంలు నిర్మించేందుకు రూ.315 కోట్ల నిధులు కేటాయిస్తున్నట్లు జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడం గర్హనీయమని ఖండిస్తున్నారు. ఈనేపథ్యంలోనే మంత్రి దురైమురుగన్ వ్యాఖ్యలు చేశారు. 1892 నాటి మద్రాసు- మైసూరు ఒప్పందం ప్రకారం నదికి ఎగువభాగంలో ఏవైనా నిర్మాణాలు చేపట్టాలంటే దిగువ రాష్ట్రాల అనుమతి తప్పనిసరి అని గుర్తు చేశారు. ఈ ఒప్పందం నది ఆయకట్టు ప్రాంతాలకు కూడా వర్తిస్తుందన్నారు. కావేరి జలవివాదాల సందర్భంగా సుప్రీంకోర్టు 2018 ఫిబ్రవరి 16న ఇచ్చిన తీర్పు పాలారు నదీ వివాదానికి కూడా వర్తిస్తుందని మంత్రి దురైమురుగన్ స్పష్టం చేశారు.

సమాచార దర్శిని

అధునాతన తయారీ ఫోరం ప్రారంభం

ఐసిఎఫ్, ఫిబ్రవరి 27: రాష్ట్రప్రభుత్వ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పృత్తుల శాఖ ఆధ్వర్యంలో స్టార్టప్ టీఎన్ పనిచేస్తోంది. ఇది ఇండస్ట్రీ 4.0 అనే అధునాతన తయారీ ఫోరంను ప్రారంభించింది. ఈ ప్రారంభోత్సవంలో స్టార్టప్ టీఎన్ సంస్థ బూడ్స్‌డ్రాపర్స్ రీసెర్చ్ కౌన్సిల్ సంస్థతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.

మార్చి 28నుంచి పాలిటెక్నిక్ సెమిస్టర్ పరీక్షలు

పెరంబూర్, ఫిబ్రవరి 27: రాష్ట్ర సాంకేతిక విద్య డైరెక్టరేట్ అనుమతితో 600లకు పైగా పాలిటెక్నిక్‌లు పనిచేస్తున్నాయి. ఈ కళాశాలల్లో ఏడాదికి రెండు సెమిస్టర్లు నిర్వహిస్తున్న నేపథ్యంలో, ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించిన రెండో సెమిస్టర్ పరీక్షలు మార్చి 28వ తేది నుంచి ప్రారంభించాలని డైరెక్టరేట్ ఉత్తర్వులు జారీ చేసింది. ఏప్రిల్ 19వ తేదిలోపు పరీక్షలు ముగించి, సెలవులు ప్రకటించాలని, కొత్త విద్యా సంవత్సరానికి జూన్ 10వ తేది నుంచి తరగతులు ప్రారంభించాలని సాంకేతిక విద్య డైరెక్టరేట్ నోటిఫికేషన్ విడుదల చేసింది.

పరిశోధన కోర్సుల అడ్మిషన్లు ప్రారంభం

పెరంబూర్, ఫిబ్రవరి 27: అన్నా విశ్వవిద్యాలయ పీహెచ్‌డీ, ఎంఎస్ తదితర పరిశోధన కోర్సుల్లో విద్యార్థుల అడ్మిషన్లకు ప్రకటన వెలువడింది. అన్నా వర్శిటీ చెన్నై ప్రాంగణంలోని కళాశాలల్లోని పరిశోధన కోర్సుల్లో చేరే విద్యార్థులకు రూ.31 వేలు ప్రోత్సాహక వేతనంగా అందిస్తుంటారు. ఈ నేపథ్యంలో, వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్లు ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించనట్లు అన్నా వర్శిటీ తెలిపింది. సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, ఆర్కిటెక్చర్ తదితర కోర్సుల్లో అడ్మిషన్లకు మార్చి 9వ తేదిలోపు దరఖాస్తులు సమర్పించాలని అన్నా వర్శిటీ తెలియజేసింది.

నేటితో ముగియనున్న గ్రూప్-4 దరఖాస్తుల స్వీకరణ

పెరంబూర్, ఫిబ్రవరి 27: ప్రభుత్వ శాఖల్లో 6,244 ఖాళీ పోస్టుల భర్తీకి 'గ్రూప్-4' పరీక్ష దరఖాస్తు స్వీకరణ గురువారంతో ముగియనుంది. ఈ పరీక్షకు సంబంధించి ఆన్‌లైన్ దరఖాస్తు స్వీకరణ జనవరి 30వ తేది ప్రారంభమైంది. మరింత సమాచారం కోసం టీఎన్‌పీఎస్సీ సంప్రదించవచ్చు. కాగా, దరఖాస్తు స్వీకరణ గడువు పెంచాలని పలువురు టీఎన్‌పీఎస్సీకి విజ్ఞప్తి చేశారు.

నేడు తిరుచెందూర్ ఆలయంలో ధారాభిషేకం

ఐసిఎఫ్, ఫిబ్రవరి 27: ఉష్ణతాపాన్ని తీర్చేలా తిరుచెందూర్ మూలవిరాట్టు మురుగ పెరుమాళ్‌కు బుధవారం నుంచి ధారాభిషేకం జరుగనుంది. ఈ ఆలయాన్ని వేకువజామున 4 గంటలకు తెరచి ఉదయం 6 గంటలకు ఉదయమార్తాండ అభిషేకం, ఉదయం 10.30, రాత్రి 7.15 అని మూడు వేళలా స్వామికి అభిషేకాలు జరుగుతున్నాయి. ఆలయ గర్భగుడిలో మూలవిరాట్టు ఉష్ణాన్ని తగ్గించేందుకు ధారాభిషేకం నిర్వహించడం ఆనవాయితీ. 2018 నుంచి ఆగిన ఈ పూజలు బుధవారం నుంచి సుమారు 100 లీటర్ల పాలతో ప్రతిరోజు ఉదయం ధారాభిషేకం నిర్వహించనున్నామని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

ప్యాసింజర్ రైలు ఛార్జీల తగ్గింపు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 27: కరోనా కాలంలో పెంచిన ప్యాసింజర్ రైళ్ల ఛార్జీలను రైల్వే శాఖ తగ్గించింది. కరోనా సమయంలో ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్ల పేరుతో ప్యాసింజర్ల రైళ్ల ఛార్జీలు పెంచారు. ఈ నేపథ్యంలో, నాలుగేళ్ల అనంతరం ఛార్జీలు తగ్గాయి. 200 కి.మీ దూరంలోపు ప్రయాణించే ఈ రైళ్లలో కనిష్ఠ ఛార్జీ రూ.30 వసూలు చేస్తుండగా, రూ.10కి తగ్గించారు. కోవై - ఈరోడ్‌కు రూ.50, ఈరోడ్ - సేలంకు రూ.40 ఉండగా కోవై - ఈరోడ్‌కు రూ.25, ఈరోడ్ - సేలంకు రూ.15 ప్రస్తుతం తగ్గించారు. అలాగే, చెన్నై నుంచి తిరుపతి వెళ్లే ప్యాసింజర్ రైళ్ల ఛార్జీలు రూ.75 నుంచి రూ.35కు తగ్గించారు.

త్వరలో 27 దుకాణాల వేలం

ఐసిఎఫ్, ఫిబ్రవరి 27: స్థానిక పెరుంగళత్తూర్ వాణిజ్య కాంప్లెక్స్‌లో ఉన్న 27 దుకాణాలకు త్వరలో వేలం నిర్వహించనున్నట్లు తాంబరం కార్పొరేషన్ తెలిపింది. 2021లో తాంబరం కార్పొరేషన్‌గా ఏర్పడిన సంగతి తెలిసిందే. ఇందులో 5 మండలాలు, 70 వార్డులుండగా, ఇక్కడ 10 లక్షలమందికి పైగా నివసిస్తున్నారు. ఈక్రమంలో 27 దుకాణాలతో ఏర్పాటుచేసిన వాణిజ్య సముదాయాన్ని ఈనెల 24వ తేది సీఎం స్టాలిన్ ప్రారంభించారు. ఈ దుకాణాల వేలం త్వరలో జరుగనుందని కార్పొరేషన్ అధికారులు తెలిపారు.

త్యాగరాజస్వామి ఆలయంలో ఆళి రథోత్సవాలు ప్రారంభం

అడయార్, ఫిబ్రవరి 27: తిరువారూర్ జిల్లాలోని త్యాగరాజస్వామి ఆలయంలో ఆళి రథోత్సవాలు మంగళవారం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఈ వేడుకల్లో భాగంగా ఉదయం 8.30 గంటలకు వినాయకుడు, సుబ్రమణ్య స్వామి, చండికేశ్వర స్వామిని మాడ వీధుల్లో ఊరేగించారు. ఆ తర్వాత త్యాగరాజ స్వామికి, ఆయన సన్నిధికి సమీపంలో ఉన్న ధ్వజస్తంభానికి శివాచార్యులు ప్రత్యేక పూజలు చేసి రథోత్సవాల ప్రారంభ సూచకంగా ధ్వజారోహణం చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాగా, ఆసియాలోనే అతిపెద్ద రథంగా గుర్తింపు పొందిన ఆళితేర్ (ఆళి రథం) 30 అడుగుల ఎత్తు, 30 అడుగుల వెడల్పుతో 200 టన్నుల బరువు కలిగివుంది.

వృద్ధాప్య పింఛన్ స్కాం

కంప్యూటర్ ఆపరేటర్ తొలగింపు

అడయార్, ఫిబ్రవరి 27: పుదుకోటలో వృద్ధాప్య పింఛను పథకంలో భాగంగా యేడాదిలో రూ.27 లక్షల మోసానికి పాల్పడిన కంప్యూటర్ ఆపరేటర్‌ను విధుల నుంచి జిల్లా యంత్రాంగం తొలగించింది. రాష్ట్ర ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రతి తాలూకాలో ప్రత్యేక తాహసీల్దార్లను నియమించి, వృద్ధాప్య పింఛన్లను మంజూరు చేస్తున్నారు. ఈ జిల్లాలో దాదాపు 3 వేల మంది వృద్ధులకు నెలకు రూ.1200 చొప్పున పింఛన్ అందిస్తున్నారు. రూ.27 లక్షలను పంపిణీ చేయకుండా కంప్యూటర్ ఆపరేటర్ స్వాహా చేశాడు. ఈ విషయాన్ని గుర్తించిన ఉన్నతాధికారులు.. ఆ ఆపరేటర్ అంబేత్ రాజాను విధుల నుంచి తొలగించారు. అలాగే, ప్రత్యేక తాహసీల్దారుతో పాటు ఇద్దరిని బదిలీ చేశారు.

తిరుమలేశుడి సేవలో శశికళ



తిరుమల శ్రీవారిని మాజీ సీఎం జయలలిత నెచ్చెలి శశికళ మంగళవారం దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

\- తిరుమల (ఆంధ్రజ్యోతి)

మద్దతిస్తే రూ.5 కోట్లు ఇస్తామన్నారు

● ఓపీఎస్‌పై అన్నాడీఎంకే ప్రిసీడియం చైర్మన్ సంచలన ఆరోపణ



తమిళ్‌మగన్ హుసేన్

ప్యారీస్, ఫిబ్రవరి 27: అన్నాడీఎంకేకు సంబంధించిన కేసులో సుప్రీంకోర్టులో తనకు అనుకూలమైన తీర్పు కోసం మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం రూ.5 కోట్లకు బేరమాడారని ఆ పార్టీ ప్రిసీడియం చైర్మన్ తమిళ్‌మగన్ హుస్సేన్ చెప్పారు. రాణిపేట జిల్లా వాలాజా సమీపంలో ఉన్న చెన్నైసముద్రం గ్రామంలో అన్నాడీఎంకే ఆధ్వర్యంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత జయంతి సందర్భంగా ఏర్పాటుచేసిన బహిరంగ సభలో తమిళ్‌మగన్ హుస్సేన్ పాల్గొని ప్రసంగించారు. దివంగత మాజీ ముఖ్యమంత్రులు ఎంజీఆర్, జయలలిత ఎన్నో ఆటంకాలు ఎదుర్కొని పార్టీని, రెండాకుల గుర్తును కాపాడారని, ఈ వ్యవహారానికి సంబంధించి దాఖలైన కేసులో హైకోర్టు, సుప్రీంకోర్టులు కూడా అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామికి అనుకూలంగా తీర్పులు వెలువరించాయని తెలిపారు. పార్టీ పేరును, ఎన్నికల గుర్తు రెండాకులను పొందాలని పన్నీర్‌సెల్వం చేసిన ప్రయత్నాలు ఫలించలేదని, అందువల్ల పార్టీకి సంబంధించి సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్‌పై సంతకం చేయకుండా, తనకు మద్దతిస్తే రూ.5 కోట్లు ఇస్తానని ఓపీఎస్ బేరమాడారని ఆరోపించారు. అందుకు తాను తిరస్కరించడంతో పాటు వెంటనే ఈపీఎస్‌కు సమాచారం అందించానన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో ఓపీఎస్ వంటి వెన్నుపోటుదారులు అన్నాడీఎంకే గెలుపును అడ్డుకోవాలని కుట్రలు పన్నుతున్నారని, అయితే, సైనికుల్లా పనిచేస్తున్న కార్యకర్తలు పార్టీని అన్ని స్థానాల్లో గెలిపిస్తారని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు.

నేమ్ బోర్డు, రిజిస్ట్రేషన్ నెంబరు లేని మద్యం దుకాణం

● పట్టించుకోని అధికారులు



సత్తువాచేరిలో నేమ్ బోర్డు, రిజిస్ట్రేషన్ నెంబరే లేని టాస్మాక్ మద్యం దుకాణం

వేలూరు, ఫిబ్రవరి 27: స్థానిక సత్తువాచేరిలోని చెన్నై సిల్క్స్ వెనుక వైపు టాస్మాక్ మద్యం దుకాణాల్లో 24 గంటలు మద్యం విక్రయాలు జరుగుతున్నాయని విమర్శలున్నాయి. అలాగే, ఒక సీసాపై రూ.5 నుంచి రూ.20 వరకు అదనంగా తీసుకుంటున్నట్లు మద్యంబాబులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోలేదని తెలిసింది. అదే సమయంలో దుకాణానికి అసలు నేమ్ బోర్డు కానీ రిజిస్ట్రేషన్ నెంబరు కూడా లేదు. ఈ విషయమై టాస్మాక్ అధికారిని సెల్‌ఫోన్‌లో సంప్రదించగా... సదరు అధికారి ఫోన్ లిఫ్ట్ చేయలేదని పలువురు పేర్కొంటున్నారు. అలాగే, రౌడీలను ఉంచుకొని మద్యం విక్రయిస్తున్నారని, ఈ విషయమై అధికారులు సత్వరం స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

రిజర్వేషన్ల ప్రకారం పోస్టులు భర్తీ చేయండి: యూజీసీ

ఐసిఎఫ్, ఫిబ్రవరి 27: రిజర్వేషన్ల ప్రకారం పోస్టులు భర్తీచేయాలని విశ్వవిద్యాలయాలకు యూజీసీ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు వర్శిటీలకు యూజీసీ పంపిన లేఖలో... అన్ని ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు అధ్యాపకులు, ఉద్యోగుల నియామకాల్లో రిజర్వేషన్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, అలాగే దివ్యాంగుల కోటాలో నిబంధనలు పాటించాలని ఆదేశించింది. త్వరలో ఖాళీ పోస్టుల భర్తీ చేయాలని పేర్కొంది.

వృద్ధుల సంక్షేమ ఆసుపత్రి డైరెక్టర్‌గా దీప

ఐసిఎఫ్, ఫిబ్రవరి 27: జాతీయ వృద్ధుల సంక్షేమ ఆసుపత్రి డైరెక్టర్‌గా డాక్టర్ దీప నియమితులయ్యారు. గిండిలో ఉన్న కింగ్ పరిశోధన ప్రాంగణంలో రూ.151.17 కోట్ల తో నిర్మించిన ఆసుపత్రిని ప్రధానమంత్రి సోమవారం ప్రారంభించారు. ఇక్కడ 40 అత్యవసర చికిత్సల సహా 200 పడకలున్నాయి. అత్యాధునిక ఉపకరణాలు, ఐదు శస్త్రచికిత్స విభాగాలు, 20 ప్రత్యేక రుసుము వార్డులు, టీవీ, ఏసీ వంటి సదుపాయాలు కల్పించారు. వైద్యులు, నర్సులు సహా 276 మంది సిబ్బంది నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో, రాజీవ్‌గాంధీ ప్రభుత్వాసుపత్రి వృద్ధుల వైద్యశాఖ డీన్‌గా ఉన్న డాక్టర్ ఎస్. దీప ఈ ఆసుపత్రి వృద్ధుల వైద్యశాఖ డీన్‌గా నియమితులయ్యారు. ఈమె ఆసుపత్రి డైరెక్టర్‌గాను బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ ఆసుపత్రి రాజీవ్ గాంధీ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో పని చేయనుంది.

3న నిరాహారదీక్ష

ఐసిఎఫ్, ఫిబ్రవరి 27: తమ డిమాండ్ల సాధనకు నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాలు ప్రకటించాయి. తమ డిమాండ్లను పరిష్కరించాలంటూ రాష్ట్రప్రభుత్వ, స్థానిక సంస్థల ఉద్యోగులు ఇటీవల ముఖ్యమంత్రిని కలుసుకొని వినతిపత్రం అందజేశారు. ఇప్పటివరకు వారి డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చలేదు. దీంతో 3వ తేది ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిరాహారదీక్ష చేపట్టనున్నామని, స్థలం, ఇతర వివరాలు త్వరలో వెల్లడిస్తామని ఉద్యోగ సంఘాల సమాఖ్య సమన్వయకర్త పీటన్ అంథోనిస్వామి తెలిపారు.

రూ.92.76 కోట్లతో భూగర్భ డ్రైనేజీ పనులు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 27: స్థానిక జల్లడియన్‌పేటలో రూ.92.76 కోట్లతో భూగర్భ డ్రైనేజీ పథకం పనులు చెన్నై మెట్రోవాటర్ ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. ఈ ప్రాంతంలో 33.38 కి.మీ పొడవున మురుగునీటి పైప్‌లైన్, 9.92 కి.మీ పొడవు మోటరు పంపులు బిగించిన పైప్‌లైన్ పనులు జరుగుతున్నాయి. వీటితో పాటు మురుగునీటి శుద్ధీకరణ కేంద్రాలు, భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్ ఏర్పాటు వంటి పనులు జరుగుతున్నాయి.

గుండె పరీక్షల వైద్య శిబిరం



శిబిరంలో నిర్వాహకులు, వైద్యులు

వేలూరు, ఫిబ్రవరి 27: గుడియాత్తం రోటరీ సంఘం, చెన్నై అపోలో చిల్డ్రన్స్ ఆసుపత్రి, అముద పళని జ్ఞాపకార్థ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో గుండె పరీక్షల ఉచిత శిబిరం బుధవారం జరిగింది. ఆర్ఎస్ రోడ్డులోని వైష్ణవి మహల్‌లో జరిగిన కార్యక్రమానికి రోటరీ సంఘ అధ్యక్షుడు వాసుదేవన్ అధ్యక్షత వహించగా, జిల్లా రోటరీ గవర్నర్ పళని ఆహ్వానించారు. కార్యక్రమానికి కేఎంజీ విద్యాసంస్థల సెక్రటరీ రాజేంద్రన్, న్యాయవాది భూపతి, పెప్సీ శ్రీనివాసన్, మాజీ జిల్లా గవర్నర్ జువరి లాల్‌జైన్ తదితరులు పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రోటరీ మాజీ అధ్యక్షుడు గోపినాథ్, అన్నామలై, డాక్టర్ సుకుమార్, తిరునావుక్కరసు, మోహన్, మహాలింగం, వెంకటేశన్, అపోలో ఆసుపత్రి చిన్నపిల్లల వైద్యులు పాల్గొన్నారు.

4న కలెక్టరేట్ల ముందు అన్నాడీఎంకే ధర్నా

ప్యారీస్, ఫిబ్రవరి 27: రాష్ట్రంలో విచ్చలవిడిగా సాగుతున్న మత్తుపదార్థాల విక్రయాలను అడ్డుకోవాలన్న కోరికతో మార్చి 4న రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కలెక్టర్ కార్యాలయల ముందు ధర్నా నిర్వహించనున్నట్లు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ప్రకటించారు. ఆయన మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో... మాదకద్రవ్యాల వినియోగాన్ని అడ్డుకొనేందుకు ఢిల్లీలో పనిచేస్తున్న ప్రత్యేక పోలీసు బృందం ఇటీవల నిర్వహించిన సోదాల్లో అరెస్టయిన ముగ్గురు తమిళనాడుకు చెందిన వారని, ఆ ముఠా నాయకుడుగా వ్యవహరించిన వ్యక్తి చెన్నై పశ్చిమ జిల్లా డీఎంకే ఓవర్సీస్ విభాగం ఆర్గనైజర్ జాఫర్‌సాధిక్ అని మీడియాలో ప్రసారమైందని, దీన్ని బట్టి డ్రగ్స్ సరఫరా చేయడంలో డీఎంకే ప్రముఖుల భాగస్వామ్యం కీలకమైందని స్పష్టమైందన్నారు. డీఎంకే ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, రాష్ట్రం మత్తులో తూలుతోందని, ఈ చర్యలు అడ్డుకోని రాష్ట్రప్రభుత్వాన్ని ఖండిస్తూ పార్టీ తరఫున 4వ తేది ఉదయం 10గంటలకు కలెక్టరేట్ల ముందు నిర్వహించనున్న ధర్నాలో ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, పార్టీ నిర్వాహకులు పాల్గొంటారని ఈపీఎస్ తెలిపారు.

పుస్తక ఎగ్జిబిషన్‌పై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శివకుమార్

వేలూరు, ఫిబ్రవరి 27: స్థానిక నేతాజీ మైదానంలో పుస్తక ప్రదర్శన జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ ప్రదర్శనపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సుబ్బులక్ష్మి అధికారులను ఆదేశించారు. ఈమేరకు వేలూరు కార్పొరేషన్ 1వ మండల పారిశుధ్య శాఖ అధికారి శివకుమార్, కాట్పాడి గాంధీ నగర్ పాఠశాల మైదానంలో ఆక్సీలియం పాఠశాలకు చెందిన సుమారు 1,500 మంది విద్యార్థులు, 55 మంది ఉపాధ్యాయులకు పుస్తక ఎగ్జిబిషన్ ఉపయోగాలను వివరించారు.

40 నియోజకవర్గాల్లో డీఎంకే ప్రచారం

● కోవైలో ఉదయనిధి కోసం తయారవుతున్న ప్రచార వాహనం

ప్యారీస్, ఫిబ్రవరి 27: లోక్‌సభ ఎన్నికల్లో తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లో ఉన్న 40 నియోజకవర్గాల్లో విజయం సాధించేందుకు అధికార డీఎంకే పథకం రూపొందించింది. ఆరు నెలల క్రితమే నియోజకవర్గాల వారీగా పార్టీ తరఫున ప్రచారాన్ని ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించారు. అదే విధంగా రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి ప్రధాన నగరాల్లో బహిరంగ సభల్లో స్టాలిన్ పాల్గొననున్నారు. పార్టీ అధిష్ఠానం ఆయన ఏఏ సభల్లో పాల్గొంటారు, ఏ ప్రాంతాల మీదుగా ప్రయాణిస్తారు, ప్రసంగించాల్సిన అంశాల నివేదికను సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగానే రాష్ట్ర యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖల మంత్రి, డీఎంకే యువజన విభాగం కార్యదర్శి ఉదయనిధి కూడా 40 నియోజకవర్గాల్లో ప్రచారంలో పాల్గొనేందుకు అనువుగా కోయంబత్తూర్‌లో ప్రచార వాహనాన్ని డిజైన్ చేస్తున్నారు. ఈ వాహనంలో అభ్యర్థితో నిలబడి ఉదయనిధి ప్రసంగించేందుకు, ప్రయాణం సమయంలో విశ్రాంతి తీసుకొనేందుకు ప్రత్యేక సదుపాయాలతో వాహనం తయారవుతోందని పార్టీ నిర్వాహకులు తెలిపారు.


వృద్ధుల హోంకు టీవీ వితరణ



హోంకు టీవీ అందిస్తున్న అన్నాడీఎంకే నాయకులు

వేలూరు, ఫిబ్రవరి 27: గుడియాత్తం రైల్వేస్టేషన్ సమీపంలోని నంబిక్కై వృద్ధుల హోంలో బుధవారం జరిగిన కార్యక్రమానికి అన్నాడీఎంకే మాజీ నగర పాసరై సెక్రటరీ తెండ్రల్‌కుట్టి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా వేలూరు కార్పొరేషన్ జిల్లా సెక్రటరీ వేల్ అయగన్ పాల్గొని, హోంకు టీవీ అందజేశారు. కార్యక్రమంలో నగర సెక్రటరీ పళని, జిల్లా ఉప సెక్రటరీ కస్వామూర్తి, జిల్లా కోశాధికారి కొడైమూర్తి, నగర మండ్రం అధ్యక్షుడు పూంగొడిమూర్తి, యూనియన్ సెక్రటరీలు శివ, నగర ఉప సెక్రటరీ రవిచంద్రన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వృద్ధులకు అన్నదానం చేశారు.

జనావాసాల్లోకి జింక



వేలూరు, ఫిబ్రవరి 27: పేర్నాంబట్టు సమీపం పల్లకుప్పం సమీపంలోని అడవుల్లో పలువురు జంతువుతున్నాయి. అవి తరచూ నీటికోసం జనావాస ప్రాంతాల్లోకి వస్తుంటాయి. అలా వచ్చిన ఓ జింక డీడీ మేట్టూరులోని ఓ ఇంట్లో చొరబడింది. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారి మాదేశ్వరన్, పోలీసులు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని, మూడేళ్ల వయస్సున్న జింకను బంధించారు. అనంతరం జింకకు ప్రాథమిక చికిత్సలందించి సమీపంలోని అడవిలో వదిలిపెట్టారు.

తీరానికి కొట్టుకొచ్చిన తాబేలు కళేబరం



ఐసిఎఫ్, ఫిబ్రవరి 27: విల్లుపురం జిల్లా మరక్కాణం తీర్థవారి సముద్ర తీరానికి ఆలివ్ రిడ్లీ తాబేలు కళేబరం కొట్టుకొచ్చింది. ఈ ప్రాంతానికి యేటా గుడ్లు పెట్టేందుకు తాబేళ్లు ఎక్కువ సంఖ్యలో వస్తుంటాయి. ఇలా తీరానికొచ్చే తాబేళ్లు వివిధ కారణాలతో మృతి చెందుతుంటాయి. ఈ నేపథ్యంలో, తీర్థవారి సముద్రతీరంలో రిడ్లీ తాబేలు కళేబరాన్ని గుర్తించిన స్థానికులు అటవీ శాఖ అధికారులకు తెలియజేశారు. అధికారులు కళేబరాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం వెటర్నరీ ఆసుపత్రికి తరలించి విచారణ జరుపుతున్నారు.

కాంగ్రెస్ నేత రంజన్ కుమార్ గృహ నిర్బంధం

అడయార్, ఫిబ్రవరి 27: ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాష్ట్ర పర్యటన సందర్భంగా నల్ల జెండాలతో నిరసన తెలిపేందుకు పిలుపునిచ్చిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీఎస్టీ విభాగ అధ్యక్షుడు రంజన్‌కుమార్‌ను పోలీసులు గృహనిర్బంధంలో ఉంచారు. పోరూరులోని ఆయన నివాసంలోనే ఆయన్ను అరెస్టు చేశారు. ఆయన ఇంటి నుంచి బయటకురాకుండా కాపలా కాశారు. ఈ చర్యను రంజన్ కుమార్ ఖండిస్తూ... ప్రధాని మోదీ రాష్ట్ర పర్యటనకు వచ్చినపుడల్లా ఇదే తరహాలో నిరసన, ఇతర ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రకటించారు.

రైతుల ఆందోళన....

ప్రధానమంత్రి మోదీ రెండు రోజుల పర్యటన నిమిత్తం మంగళవారం రాష్ట్రానికి వచ్చారు. మంగళవారం తిరుప్పూరుకు రాగా, ఆయన పర్యటనను ఖండిస్తూ పలు రైతు సంఘాలు నిరసన తెలుపుతూ ఆందోళనకు దిగాయి. పల్లడం సమీపంలో కొందరు రైతులు నల్ల జెండాలతో నిరసన తెలిపారు. ఈ ఆందోళన కార్యక్రమానికి తమిళగ వ్యవసాయదారుల రక్షణ సంఘం వ్యవస్థాపకుడు, న్యాయవాది ఈసన్ మురుగస్వామి నేతృత్వం వహించారు. కనీస మద్దతు ధరకు చట్టబద్ధతతో పాటు అనేక డిమాండ్ల పరిష్కారం కోసం ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు గత కొన్ని రోజులుగా ఆందోళన చేస్తున్న విషయం తెల్సిందే. వీరికి సంఘీభావం తెలుపుతూ, ప్రధాని పర్యటనకు నిరసన తెలుపుతూ అనేక మంది రైతులు ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఏప్రిల్ నుంచి మారిషస్‌కు విమాన సేవలు పునఃప్రారంభం



వివరాలు వెల్లడిస్తున్న నిర్వాహకులు

చెన్నై, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ 13వ తేదీ నుంచి మారిషస్‌కు విమాన సేవలు పునఃప్రారంభిస్తున్నట్లు ఎయిర్ మారిషస్ సంస్థ ప్రకటించింది. ఆ సంస్థ ఉన్నతాధికారి లారెంట్ రికోరా చెన్నైలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. 254 సీట్ల సామర్థ్యమున్న ఎ330 ఎయిర్‌బస్‌ను చెన్నై నుంచి నడపనున్నట్లు ప్రకటించారు. ఏప్రిల్ 12వ నుంచి మారిషస్‌లో, 13వ తేదీ నుంచి చెన్నైలో తమ విమాన సేవలు ప్రారంభమవుతాయన్నారు. నాలుగేళ్ల తరువాత విమాన సేవలు పునఃప్రారంభిస్తున్నామన్నారు. ప్రస్తుతం తమ సంస్థ ముంబై నుంచి వారానికి ఆరుసార్లు, ఢిల్లీ నుంచి వారానికి మూడుమార్లు సర్వీసు నడుపుతున్నట్లు వివరించారు.



చెన్నై టి.నగర్ జీఎన్ చెట్టి రోడ్డులో బుధవారం నుంచి ప్రారంభం కానున్న పద్మావతి అమ్మవారి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం కుంకుమార్చన నిర్వహిస్తున్న అర్చకులు

రోజ్ మిల్క్‌లో 'రొడమైన్ బి'

ఐసిఎఫ్, ఫిబ్రవరి 27: పీచు మిఠాయిలో ఉన్నట్లే రోజ్ మిల్క్, పుచ్చకాయ వంటి ఆహార పదార్థాల్లో క్యాన్సర్ కారకమైన 'రొడమైన్ బి' రసాయనం కలిసి ఉందని ఆహార భద్రత శాఖ అధికారి సతీష్‌కుమార్ తెలిపారు. వివిధ రంగుల్లో విక్రయించిన పీచు మిఠాయిలో ఈ రసాయన పదార్థాన్ని గుర్తించిన ఆరోగ్యశాఖ దాన్ని నిషేధించింది. ఈ నేపథ్యంలో, తాంబూలంలో వినియోగించే వక్కపలుకులు, రోజ్‌మిల్క్, రాగులు, పుచ్చకాయ, ఎర్ర ముల్లంగి, గెనుసుగడ్డలకూ రొడమైన్ బి రసాయనాన్ని కలుపుతున్నట్లు ఆహార భద్రతా శాఖ గుర్తించింది. ఈ విషయమై ఆ శాఖ అధికారి సతీష్‌కుమార్ మాట్లాడుతూ... ఆహార నాణ్యత ధృవీకరణ పత్రం పొందిన దుకాణాల్లో ఎక్కువగా ఇలాంటి రసాయనాలు కలపడం లేదని, ఫుట్‌పాత్ దుకాణాలల్లో కలుపుతున్నారని ఫిర్యాదులందినట్లు తెలిపారు. నూనె, నీటిలో ముంచిన దూది తీసుకొని నెమ్మదిగా ఆహార వస్తువులపై రుద్దినప్పుడు... దూది రంగు మారితే రసాయనం కలిపినట్టన్నారు. దీనిపై నెం.9444042322కు ఫిర్యాదు చేయాలని కోరారు.

రూ.53 కోట్ల కొలను స్వాధీనం

ఐసిఎఫ్, ఫిబ్రవరి 27: స్థానిక మదురవాయల్‌లో రూ.53 కోట్ల విలువైన కొలనును రెవెన్యూ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అడయాలంపట్టు పంచాయతీ పరిధిలోని కులకరై వీధిలో ప్రభుత్వానికి చెందిన 2.40 ఎకరాల కొలనును ఆక్రమించినట్లు ఫిర్యాదులందాయి. రెవెన్యూ శాఖ అధికారులు పోలీసులతో వెళ్లి ఆక్రమణలు తొలగించి స్థలం స్వాధీనం చేసుకున్నారు. అలాగే నెర్‌కుండ్రంలో మారినారాయణమ్మన్ ఆలయానికి చెందిన రూ.కోటి విలువైన స్థలాన్ని దేవాదాయ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆలయం సమీపంలో ఉన్న 950 చదరపు అడుగుల స్థలాన్ని ఆక్రమించి దుకాణాలు ఏర్పాటుచేసి లీజుకిచ్చారు. సమాచారం తెలుసుకున్న దేవాదాయ శాఖ అధికారులు దుకాణాలను సీజ్ చేశారు.

గంజాయితో ఇద్దరి అరెస్ట్

ప్యారీస్, ఫిబ్రవరి 27: స్థానిక పుళల్ ప్రాంతంలో మూడు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు ఓ మహిళ సహా ఇద్దరిని అరెస్ట్ చేశారు. పుళల్ ప్రాంతంలో జాతీయ రహదారిలో డ్రైవర్లు, క్లీనర్లు, వలస కార్మికులకు గంజాయి విక్రయిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రాజాసింగ్‌కు అందిన సమాచారంతో సిబ్బంది మఫ్టీలో నిఘా వేశారు. సోమవారం సాయంత్రం రోడ్డు పక్కన నిలుచున్న ఓ మహిళ కొంతమంది యువకులకు గంజాయి విక్రయిస్తుండగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విచారణ జరుపగా, ఆమె ఆరతి (22) అని తెలిసింది. ఆమె ఇంట్లో తనిఖీ చేసి 3 కిలోల గంజాయి ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని ఆమెను సహకరించిన చోళవరానికి చెందిన ఇద్దరిని అరెస్ట్ చేశారు. వారు ఆంధ్రప్రదేశ్ నుంచి గంజాయిని తరలించి పుళల్‌లో విక్రయిస్తున్నట్లు తెలిపిన పోలీసులు, వారిపై కేసు నమోదుచేసి కోర్టు ఉత్తర్వులతో రిమాండ్‌కు తరలించారు.

రేషన్ బియ్యం స్వాధీనం

ప్యారీస్, ఫిబ్రవరి 27: స్థానిక అంబత్తూర్‌లో అక్రమంగా తరలించిన 1,050 కిలోల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని ఓ యువకుడిని అరెస్ట్ చేశారు. అంబత్తూర్, ఆవడి, పట్టాభిరాం ప్రాంతాల్లో ఉన్న రేషన్ దుకాణాల్లో కుటుంబ కార్డులకు ఉచితంగా పంపిణీ చేస్తున్న బియ్యాన్ని కొనుగోలు చేసి బహిరంగ మార్కెట్‌కు సరఫరా చేస్తున్నట్లు స్థానిక ఆహార భద్రత శాఖ అధికారులకు సమాచారం అందింది. దీంతో అధికారుల బృందం అంబత్తూర్ రైల్వేస్టేషన్ సమీపంలో ఫుట్‌పాత్‌పై పేర్చిన బియ్యం మూటలను తనిఖీ చేసి, అందులో రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. తిరునింద్రవూర్‌కు చెందిన విశ్వనాథన్(21)ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచి జైలుకు తరలించారు.

ఆత్మహత్యకు యత్నించిన హిజ్రాలు

ప్యారీస్, ఫిబ్రవరి 27: స్థానిక అన్నానగర్‌లో గృహప్రవేశం జరిగిన ఇంటికెళ్లిన హిజ్రాలు తమకు నగదు ముట్టచెప్పాలని డిమాండ్ చేయడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఆ సమయంలో సంజన, లల్లీ, రోజీ, జెనిఫర్, చారు అనే హిజ్రాలు ఆత్మహత్యకు యత్నించారు. అడ్డుకున్న పోలీసులు రోజీ, లల్లీలను అరెస్ట్ చేయగా, మిగతా ముగ్గురు పోలీసుల కళ్లుగప్పి అక్కడి నుంచి చల్లగా జారుకున్నారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

మొదటి భార్య ఇంటికి భర్త వెళుతున్నాడనీ...

● ఇద్దరు పిల్లలతో రైలుకింద పడి రెండో భార్య ఆత్మహత్య

అడయార్, ఫిబ్రవరి 27: తన భర్త మొదటి భార్య ఇంటికి పదేపదే వెళ్లడాన్ని జీర్ణించుకోలేని రెండో భార్య తన ఇద్దరు పిల్లలతో కలిసి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. ఈ విషాదకర ఘటన రాణిపేట జిల్లా వాలాజా రైల్వే స్టేషన్ వద్ద జరిగింది. పోలీసుల కథనం మేరకు... జిల్లాలోని కీళ్‌వేలం గ్రామానికి చెందిన అరివళగన్ మాజీ సైనికోద్యోగి. ఆయనకు విజయలక్ష్మితో వివాహమైన యేడాదిలోనే మనస్పర్థలు తలెత్తాయి. దీంతో విజయలక్ష్మి తన పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో వెన్నిల(28)ను అరివళగన్ రెండో వివాహం చేసుకున్నారు. వీరికి జెనుశ్రీ(6), తారుణిక(4) పిల్లలున్నారు. అయితే, అరివళగన్ గత కొన్ని రోజులుగా మొదటి భార్య విజయలక్ష్మి వద్దకు వెళ్లడం ప్రారంభించాడు. దీన్ని జీర్ణించుకోలేని వెన్నిల.. తన ఇద్దరు పిల్లలతో కలిసి వాలాజా రైల్వే స్టేషన్ వద్దకు వెళ్లి ఎర్నాకుళం - హౌరా ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది.

నకిలీ టిక్కెట్‌తో విమానాశ్రయంలో సంచారం

బంగ్లాదేశ్ యువకుడి అరెస్ట్

చెన్నై, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయంలో అనుమానాస్పదంగా సంచరించిన ఓ యువకుడిని సీఐఎస్ఎఫ్ సిబ్బంది అరెస్ట్ చేశారు. అతని వద్ద ఉన్న టిక్కెట్టు తనిఖీ చేయగా, అది నకిలీదని తేలడంతో అదుపులోకి తీసుకొని విచారణ జరిపారు. అతను బంగ్లాదేశ్‌కు చెందిన షా ఆలం అని, కౌలాలంపూర్‌కు వెళ్లిన ఓ బంధువుకు చెందిన టిక్కెట్ జెరాక్స్‌తో విమానాశ్రయానికి వచ్చినట్లు విచారణలో వెల్లడైంది. ఢిల్లీలో వుంటున్న షా.. రెండు రోజుల క్రితం ఇక్కడకు వచ్చినట్లు తెలిసింది.



'సౌత్‌సిటీ 324 ఎం' జిల్లా తరఫున తండయార్‌పేటలోని పాఠశాలకు చెందిన పేద విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఆ సంస్థ కార్యదర్శి డాక్టర్ ఏవీ శివకుమారి



కాంట్రాక్టు ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని కోరుతూ చెన్నైలోని విద్యుత్ బోర్డ్ కార్యాలయం ఎదుట సీఐటీయూ నిరాహారదీక్ష



విలేకరుల సమావేశంలో అర్జున్ దాస్

'పోర్'... కాలేజీ లైఫ్

● అర్జున్ దాస్

చిత్రజ్యోతి

మలయాళ దర్శకుడు బిజోయ్ నంబియార్ రూపొందించిన 'పోర్' సినిమా కాలేజీ లైఫ్ ఆధారంగా చేసుకుని తెరకెక్కిందని ఆ చిత్రంలో ప్రధాన పాత్రను పోషించిన నటుడు అర్జున్‌దాస్ చెప్పారు. 'సైతాన్', 'డేవిడ్', 'వాజీర్', 'షోలో' వంటి అనేక చిత్రాలను తెరకెక్కించిన బిజోయ్ నంబియార్... తాజాగా తమిళం, హిందీ భాషల్లో అర్జున్ దాస్, కాళిదాస్ జయరాం ప్రధాన పాత్రధారులుగా చేసుకుని 'పోర్' మూవీని తెరకెక్కించారు. ఇతర పాత్రల్లో డీజే భాను, సంజనా నటరాజన్, మెర్విన్ రోసారియో వంటి పలువురు నటించారు. ఆడియో, ట్రైలర్ సోమవారం చెన్నైలో విడుదల చేశారు. టి సిరీస్, రూక్స్ మీడియా సంయుక్తంగా నిర్మించాయి. ఆడియో రిలీజ్ వేడుకలో అర్జున్‌దాస్ మాట్లాడుతూ... 'ఈ అవకాశం ఇచ్చిన దర్శకుడికి ధన్యవాదాలు. ఓ హోటల్‌లో స్టోరీ వినిపించారు. అప్పటికే కాళిదాస్ సెలెక్ట్ అయ్యారు. షూటింగ్ సమయంలో దర్శకుడు పూర్తి స్వేచ్ఛనిచ్చారు. సాధారణంగా రెండు భాషల్లో ఒక చిత్రాన్ని తెరకెక్కించేటపుడు ఇంకో భాషలో చిత్రీకరించిన ఫుటేజీని ఏ దర్శకుడు చూపించరు. కానీ, బిజోయ్ మరో భాషలో షూట్ చేసిన ఫుటేజీ చూపించి సహజంగా నటించమని సలహా ఇచ్చారు. ఈ సినిమా కాలేజీ లైఫ్ ఆధారంగా తెరకెక్కింది. ప్రతి ఒక్కరూ చూసి ఎంజాయ్ చేసేలా ఉంటటుంది. స్నేహంతో పాటు పలుఅంశాలు కూడా ఉన్నాయి. కాళిదాస్ జయరాంతో మళ్లీ నటించాలని ఉంది. మరో షూటింగ్ ఉండటంతో కాళిదాస్ ఇక్కడికి రాలేకపోయారు' అని అన్నారు. దర్శకుడు బిజోయ్ మాట్లాడుతూ... 'తమిళంలో స్ట్రైట్ సినిమా తీసేందుకు నేను చేసిన మూడో ప్రయత్నమే ఈ 'పోర్'. 'షోలో' చిత్రాన్ని కూడా ఆ లక్ష్యంతోనే తీశా. కానీ ఆ సినిమాను థియేటర్‌లో రిలీజ్ చేయలేకపోయా. ఇది ఫుల్‌లెంగ్త్ తమిళ చిత్రం. తమిళ వెర్షన్ ఎంతో బాగా వచ్చింది' అన్నారు. ఆ తర్వాత హీరోయిన్లు సంజనా నటరాజన్, డీజే భాను, నిర్మాత మధు అలెక్స్ తదితరులు ప్రసంగించారు. మార్చి 1న ఈ సినిమాను విడుదల చేయనున్నారు.

వారి మధ్య ఏం జరిగింది?

కొత్త ముఖాలు వెంకట్, వర్షిణి జంటగా, కణ్ణన్, మనోహర్ ప్రధాన పాత్రల్లో దర్శకుడు సోమన్ క్యాస్ట్రో తెరకెక్కించిన చిత్రం 'ఎక్స్‌వైజెడ్'. చిత్రీకరణ పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ సినిమా వివరాలను దర్శకుడు సోమన్ విలేకరులకు వివరిస్తూ... 'ఒక గ్రామంలో నివసించే తండ్రి తన ఏకైక కుమారుడి ఎంతో కష్టపడి ఉన్నత చదవు చదివిస్తాడు. ఈ క్రమంలో బెంగళూరులో ఒక మంచి ఉద్యోగం చేసే హీరోకు.. అక్కడ ఒక ఐటీ కంపెనీలో పనిచేసే హీరోయిన్‌కు పరిచయం ఏర్పడుతుంది. ఈ పరిచయం ప్రేమగా మారడంతో సహజీవనం చేస్తుంటారు. ఈ క్రమంలో హీరోకు అమెరికాలో మంచి ఉద్యోగం వస్తుంది. ఈ విషయాన్ని తన తండ్రికి చెప్పి, ఆయన ఆశీర్వాదం తీసుకునేందుకు గ్రామానికి తన ప్రియురాలితో వచ్చిన హీరోకు ఎలాంటి సమస్యలు ఎదురయ్యాయి? తన చిన్ననాటి కల అయిన అమెరికా ఉద్యోగానికి హీరో వెళ్లాడా? లేదా? అనే విషయాలను ఎంతో ఎమోషనల్‌గా తెరపై చూపించాం. విడుదలకు ముందే పుణె, ముంబై, ఔరంగాబాద్‌లలో జరిగిన ఇంటర్నేషనల్ ఫెస్టివల్స్‌లో బెస్ట్ మూవీ కేటగిరీలో ఐదు అవార్డులు అందుకుంది' అని పేర్కొన్నారు. ఈ సినిమాకు కెమెరా సెల్వం - శక్తి, పాటలు సెంగకదిర్‌వానన్, సంగీతం వి.కిషోర్ కుమార్.



సోమన్ క్యాస్ట్రో, వెంకట్, వర్షిణి

డార్క్ షేడ్ పాత్రలో శ్రీకాంత్

● 1న 'సత్తమింద్రి ముత్తం తా' రిలీజ్



విలేకరుల సమావేశంలో చిత్ర బృందం

ఒకప్పుడు లవర్‌బాయ్‌గా ప్రేక్షకుల్లో గుర్తింపు పొందిన శ్రీకాంత్ చాలా గ్యాప్ తర్వాత నటించిన చిత్రం 'సత్తమింద్రి ముత్తం తా'. మార్చి 1న విడుదలకానుంది. రాజ్‌దేవ్ కథను సమకూర్చి, దర్శకత్వం వహించిన ఈ మూవీలో కన్నడ నటి ప్రియాంక తిమ్మేష్ హీరోయిన్‌గా నటించగా, నిహారిక, వియాన్, హరీష్ పేరడి తదితరులు ఇతర పాత్రలను పోషించారు. చిత్రం విడుదలను పురస్కరించుకుని సోమవారం రాత్రి చిత్ర బృందం విలేకరుల సమావేశం నిర్వహించింది. దర్శకుడు రాజ్‌దేవ్ మాట్లాడుతూ... 'విధి, జ్ఞాపకాలు, న్యాయపరమైన చిక్కులు' అనే మూడు అంశాలను అన్వేషించే ఒక తమిళ చిత్రం. ఒక ప్రమాదంలో చిక్కుకున్న హీరోయిన్‌ను హీరో కలుసుకున్నపుడు జరిగే సంఘటన సమాహారమే ఈ చిత్రం. హీరోయిన్ మతిమరుపు సమస్యతో బాధపడుతుంటోంది. ఆమెను చూసిన హీరో తన ఆధీనంలోకి తీసుకుంటాడు. ఆమెకు పాత విషయాలు ఏవీ జ్ఞప్తికి రావు. ఇంతలో ఆమె భర్త... ఆమె కోసం గాలిస్తూ, భార్య కనిపించలేదని పోలీసులకు ఫిర్యాదు చేస్తాడు. ఇందులో ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌గా హరీష్ పేరడి నటించారు. శ్రీకాంత్‌కు, హరీష్ పేరడి, హీరోయిన్‌కు మధ్య జరిగే సన్నివేశాలు సీట్ ఎడ్జ్ థ్రిల్లర్ అనుభూతిని కలిగిస్తాయి. మంచి కథాంశంతో అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా తెరకెక్కించా. స్టోరీకి తగిన నటీనటులతో ఈ చిత్రాన్ని రూపొందించా. లవ్, ఎమోషన్, థ్రిల్లర్, హర్రర్ ఇలా అన్ని అంశాలు కలగలసి వున్నాయి. మీడియా మిత్రులకు కూడా బాగా నచ్చుతుంది. జుబిన్ సంగీతం చిత్రానికి మరింత బలం చేకూర్చుతుంది' అన్నారు. హీరోయిన్ ప్రియాంక మాట్లాడుతూ, 'ఇది నాకు తొలి తమిళ చిత్రం. ఈ అవకాశం ఇచ్చిన దర్శక నిర్మాతలకు ధన్యవాదాలు. కన్నడంలో పలు చిత్రాలు నటించినప్పటికీ ఇందులో నటించడం కొత్త అనుభూతిని కలిగించింది. సాధారణంగా ముద్దు ఎలా పెట్టినా చిన్నపాటి శబ్దం వస్తుంది. కానీ, కథకు తగిన విధంగా ఈ టైటిల్ సరిగ్గా సరిపోయింది' అని అన్నారు.

సెయిలర్ నుంచి విలన్ స్థాయికి...

● దాశరథికి నటుడిగా ఎనిమిదేళ్లు పూర్తి



ప్రతి ఒక్కరిలో ఏదో ఒక కల ఉంటుంది. కానీ ఆ కలను నెరవేర్చుకునేందుకు కొందరు మాత్రమే ప్రయత్నిస్తుంటారు. అలాంటి వారిలో దాశరథి నరసింహన్ ఒకరు. ఇటీవల విడుదలైన 'రణం' చిత్రంలో ప్రధాన విలన్ పాత్రలో అద్భుతంగా నటించి ప్రేక్షకులతో శెభాష్ అనిపించుకున్నారు. ఇందులో నెక్రోఫీలియా అనే వ్యాధితో బాధపడే వైద్యుడు అశ్వంత్ పాత్రలో కనిపించారు. కాలేజీ విద్యను పూర్తి చేసుకున్న తర్వాత కొంతకాలం పాటు సెయిలర్‌గా ఉద్యోగం చేశారు. ఆ ఉద్యోగం సంతృప్తినివ్వకపోగా తన సుదీర్ఘ కలను నెరవేర్చుకునేందుకు చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టారు. తన ప్రయత్నాలు ఫలించి 2016లో వెంకట్ ప్రభు దర్శకత్వంలో వచ్చిన 'చెన్నై-28'లో బ్యాడ్ బాయ్స్ టీమ్‌లో సభ్యుడిగా వెండితెరపై తొలిసారి కనిపించారు. ఆ తర్వాత అరుణ్‌రాజా కామరాజ్ దర్శకత్వంలో వచ్చిన 'కనా' చిత్రంలో హీరో స్నేహితుడి పాత్రను పోషించారు. ఆ తర్వాత అనేక చిత్రాల్లో నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ క్రమంలోనే గత యేడాది హీరో అజిత్ నటించిన 'తుణివు'లో కీలక పాత్రలో నటించారు. ఈ నెలలో విడుదలైన 'లాల్‌సలాం'లోనూ హీరో విష్ణువిశాల్ ఫ్రెండ్‌గా నటించారు. ఇపుడు అజిత్ 'విడాముయర్చి' చిత్రంలో నటిస్తున్నారు. చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టి ఎనిమిదేళ్లు పూర్తి చేసుకున్న దాశరథి... సపోర్టింగ్ పాత్రలే కాకుండా, ప్రధాన ప్రతినాయకుడి పాత్రలను సైతం పోషిస్తున్నారు. మున్ముందు కూడా అన్ని రకాల పాత్రలను పోషించేందుకు సిద్ధమని వెల్లడించారు.

రైలు ప్రమాదాన్ని అడ్డుకున్న వృద్ధదంపతులకు రూ.5లక్షల బహుమానం

● సీఎం స్టాలిన్ ప్రకటన



వద్ధ దంపతులు వడకత్తియార్, షణ్ముగయ్య

చెన్నై, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): తెన్‌కాశి జిల్లా సెంగోట్టై తాలూకా పులియరై వద్ద ప్రాణాలకు తెగించి రైలు ప్రమాదాన్ని అడ్డుకున్న వృద్ధదంపతులను రూ.5లక్షల నగదుతో సత్కరించనున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు. ఆ మేరకు మంగళవారం మధ్యాహ్నం ఆయన ఓ ప్రకటన జారీ చేస్తూ పులియరై గ్రామం సమీపం కేరళ రాష్ట్ర సరిహద్దులో 'ఎస్' వలైవు అనే చోట ఈ నెల 25 వేకువజాము ఒంటి గంట ప్రాంతంలో తిరుమంగళం - కొల్లమ్ జాతీయ రహదారిలో వెళ్తిన లారీ అదుపు తప్పి 40 అడుగుల ఎత్తు నుండి దొర్లి దిగువనున్న సెంగోట్టై - కొల్లమ్ రైలు పట్టాలపై బోల్తాపడింది. ఆ శబ్దం విని ఆ ప్రాంతంలో నివసిస్తున్న షణ్ముగయ్య, వడకుత్తియాల్ అనే వృద్ధ దంపతులు సెంగోట్టై నుంచి పునలూరుకు వేగంగా వస్తున్న భగవతి అమ్మన్ ఆలయ భక్తుల ప్రత్యేక రైలు చూశారు. ఆ రైలు పట్టాలపై పడి ఉన్న లారీని ఢీకొంటే ఘోర ప్రమాదం జరుగుతుందని గ్రహించారు. వెంటనే వారిద్దరు చేత టార్చి లైటు పట్టుకుని ఆ రైలింజన్ డ్రైవర్‌కు పట్టాలపై లారీ పడి ఉన్నట్లు సైగలు చేసి తెలిపారు. ఆ డ్రైవర్ ఆ వృద్ధుల సైగలను అర్థం చేసుకుని వెంటనే సడన్ బ్రేకు వేసి రైలును నిలిపివేశారు. ఆ తర్వాత డ్రైవర్ పట్టాలపై పడి ఉన్న లారీని చూసి దిగ్భ్రాంతి చెందారు. ఆ తర్వాత ఆ వృద్ధదంపతులను డ్రైవర్, రైల్వే శాఖ అధికారులు ప్రశంసించారు. ఈ వివరాలను స్టాలిన్ తన ప్రకటనలో పేర్కొన్నారు. అంతేకాకుండా ఆ దంపతులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రూ.5లక్షలను బహుమతిగా ఇవ్వనున్నట్లు ప్రకటించారు.

నైపుణ్య విద్యతోనే బంగారు భవిష్యత్తు

● మాస్ వ్యవస్థాపక దినంలో శాస్త్రవేత్త కొల్లి రాజు



విద్యార్థినికి పోటీపరీక్షల గైడ్ పంపిణీ చేస్తున్న ఐఏఎస్ మాజీ అధికారి మణివన్నన్, డీఆర్వో దివ్యశ్రీ తదితరులు

ప్యారీస్, ఫిబ్రవరి 27: నైపుణ్యాలతో కూడిన విద్యను అభ్యసిస్తేనే బంగారు భవిష్యత్తు ఉంటుందని విద్యార్థులకు ప్రముఖ శాస్త్రవేత్త, మద్రాసు ఆది ఆంధ్ర అరుంధతీయ ఆదివాసీ సంక్షేమ సంఘం (మాస్) అధ్యక్షుడు డాక్టర్ కొల్లి రాజు అన్నారు. మాస్ వ్యవస్థాపకుడు, మాజీ ఐపీఎస్ అధికారి కేజీ గోపాలకృష్ణ వర్ధంతి సందర్భంగా 28వ మాస్ వ్యవస్థాపక దినాన్ని స్థానిక ఎగ్మూర్‌లోని జీవనజ్యోతి హాలులో సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ...' ప్రార్థనా గీతం, జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన ఈ కార్యక్రమానికి కొల్లి రాజు సారథ్యం వహించి, భారత రాజ్యాంగ నిర్మాణశిల్పి అంబేద్కర్, కేజీ గోపాలకృష్ణ చిత్రపటాలకు అతిథులతో కలసి పూలు చల్లి నివాళి అర్పించారు. సంయుక్త కార్యదర్శి ఎస్.తిరుపతయ్య ఆహ్వానం పలికారు. కొల్లి రాజు తన అధ్యక్షోపన్యాసంలో... ఆది ఆంధ్ర అరుంధతీయ వర్గాల ప్రజల జీవనశైలిని మెరుగు పరచాలన్న ఆశయంతో ఐపీఎస్ అధికారిగా వ్యవహరించిన కేజీ గోపాలకృష్ణ... మాస్‌ను స్థాపించి చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు. ఆ మహోన్నతుడి బాటలో పయనిస్తూ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా 38 ఏళ్లగా విద్యార్థులకు అండగా నిలిచి వారు ఉన్నత విద్యలో రాణించేలా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వైద్య విద్య, ఇంజనీరింగ్, న్యాయ శాఖ, కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు నిర్వహిస్తున్న పోటీ పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులు సాధించేలా వారికి అవసరమైన శిక్షణ ఉచితంగా ఇప్పిస్తున్నామని కొల్లి రాజు తెలిపారు. ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్రప్రభుత్వ మాజీ ప్రిన్సిపల్ కార్యదర్శి డాక్టర్ ఐవీ మణివన్నన్, రూ.లక్ష విలువైన యూపీఎస్సీ, టీఎన్‌పీఎస్సీ తదితర పరీక్షలకు సంబంధించిన మెటీరియన్‌ను 70మంది విద్యార్థినీ, విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమాజంలో అణగారిన వర్గాల కుటుంబాల విద్యార్థుల భవిష్యత్తు చక్కగా ఉండాలన్న ఉద్దేశంతో మాస్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. విశిష్ట అతిథి డిస్ట్రిక్ రెవెన్యూ ఆఫీసర్ జీఆర్ దివ్యదర్శిని మాట్లాడుతూ... తాను పెరంబూర్ శాసనసభ నియోజకవర్గంలోని వ్యాసర్పాడిలో స్లమ్ క్లియరెన్స్ బోర్డు ఇంట్లో పెరిగి తల్లిదండ్రుల ప్రోత్సాహంతో శ్రద్ధగా చదువుకొని ప్రస్తుతం డీఆర్వో స్థితికి చేరుకోగలిగానని, తనలాగే ఈ సభలో ఉన్న విద్యార్థులు కూడా సమాజం గౌరవించేలా ఉన్నతస్థాయికి ఎదగాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆత్మీయ అతిథులుగా ఇన్‌కంట్యాక్స్ జాయింట్ కమిషనర్ జీ.వీ.అనీల్‌కుమార్, లోక్‌సభ డిప్యూటీ సెక్రటరీ కేజీ సిద్ధార్థ, కీలక ఉపన్యాసకులుగా టామ్స్ వ్యవస్థాపకులు గొల్లపల్లి ఇశ్రాయేలు, రాష్ట్రప్రభుత్వ అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఒ.జానకిరామ్ తదితరులు పాల్గొని మాస్ సేవలను అభినందించారు. రాధాకృష్ణ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ ఎం.రాధాకృష్ణన్, ఎస్‌బీఐ రిటైర్డ్ ఏజీఎం కొత్త వెంకటేశ్వర్లు, న్యాయవాది, మాస్ ఉపాధ్యక్షుడు నూనె శ్రీనివాసులు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రభుత్వాల తరఫున అందుబాటులో ఉన్న ఉచిత శిక్షణ కేంద్రాల వివరాలు, వాటి పనితీరు వివరించారు. కార్యక్రమంలో కేపీ రావు, ఎం.వీరయ్య, సీనియర్ నిర్వాహకుడు ఒ.జగ్గయ్య తదితరులు పాల్గొన్నారు.

40 మెట్రో రైల్వేస్టేషన్లలో సిమ్స్ ఫార్మసీలు

● వడపళనిలో తొలి మందులషాపు ప్రారంభం

చెన్నై, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 40 మెట్రోరైల్వే స్టేషన్లలో సిమ్స్ (ఎస్ఆర్ఎం ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) ఫార్మసీలు ఏర్పాటు చేయనున్నట్లు ఆ సంస్థ ఉపాధ్యక్షుడు డాక్టర్ రాజు శివసామి తెలిపారు. ఈ మేరకు చెన్నై మెట్రోరైల్వే లిమిటెడ్ సహకారంతో ఈ మందుల దుకాణాలను ఏర్పాటు చేస్తామన్నారు. మంగళవారం ఉదయం వడపళని మెట్రోరైల్వేస్టేషన్‌లో తొలి ఫార్మసీ ప్రారంభోత్సవం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమంలో సీఎంఆర్‌ఎల్ డైరెక్టర్ (సిస్టమ్స్ అండ్ ఆపరేషన్స్) రాజేష్ చతుర్వేది, సీఎంఆర్‌ఎల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.అర్జునన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో డాక్టర్ రాజు శివసామి మాట్లాడుతూ ఎస్ఆర్ఎం గ్రూపు ఛైర్మన్ డాక్టర్ రవి పచ్చముత్తు సలహా మేరకే మెట్రోరైలు ప్రయాణికులకు ఆరోగ్యసేవలందించే దిశగా సీఎంఆర్‌ఎల్‌తో కలిసి ఈ మందుల దుకాణాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ ఫార్మసీల్లో ప్రాథమిక చికిత్సలందించటానికి సునిశిత శిక్షణ పొందిన నర్సులు అందుబాటులో ఉంటారని, అంతేకాకుండా తమ ఆసుపత్రిలోని స్పెషలిస్టుల నుంచి టెలి కన్సల్టేషన్ సదుపాయం, హల్లో డాక్టర్ సేవలను పొందవచ్చన్నారు. సీఎంఆర్ఎల్ డైరెక్టర్ అర్జునన్ మాట్లాడుతూ మెట్రోరైల్వే స్టేషన్లలో మందుల దుకాణాలను ఏర్పాటు చేయాలని ప్రయత్నాలు సాగించామని, చివరకు సిమ్స్ సహకారంతో అవి సఫలమయ్యాయన్నారు.



ఒప్పందపత్రాన్ని ప్రదర్శిస్తున్న రాజు శివసామి, రాజేష్ చతుర్వేది తదితరులు

ఆ మంత్రి పదవి ఎవరికి ఇవ్వాలి?

● స్వామివద్ద అనుగ్రహం కోరిన సీఎం రంగస్వామి

పుదుచ్చేరి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): తన మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న ఐదో మంత్రి పదవిని ఎవరికి కేటాయించాలన్న అంశంపై సేలం జిల్లా సూరామంగళంలో ఉన్న అప్పా పైత్యం స్వామి వద్ద పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామి అనుగ్రహం కోరారు. సోమవారం సేలం జిల్లాలో జరిగిన ఒక శుభకార్యంలో పాల్గొన్న ఆయన.. ఆ తర్వాత సూరామంగళంలోని అప్పా పైత్యం స్వామి వద్దకు వెళ్లి అనుగ్రహం కోరారు. మంత్రి పదవికి ఎవరికి ఇవ్వాలన్న అంశంపై ఆయన స్వామి వద్ద చర్చించారు. కాగా, తన మంత్రివర్గంలో రవాణా మంత్రిగా ఉన్న చంద్రప్రియాంక నాలుగు నెలల క్రితం తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. అప్పటి నుంచి ఖాళీని సీఎం భర్తీ చేయలేదు. త్వరలో లోక్‌సభ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఈ ఖాళీని భర్తీ చేసేందుకు ఆయన కసరత్తులు చేస్తున్నారు.

ప్రజాధనంతో ప్రధాని మోదీ పబ్లిసిటీ

● దిండిగల్ శ్రీనివాసన్ ధ్వజం

అడయార్, ఫిబ్రవరి 27: ప్రజాధనంతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పబ్లిసిటీ చేసుకుంటున్నారని అన్నాడీఎంకే సీనియర్ నేత, మాజీ మంత్రి దిండిగల్ శ్రీనివాస్ ధ్వజమెత్తారు. దిండిగల్‌లో మాజీ ముఖ్యమంత్రి దివంగత జయలలిత జయంతి వేడుకలు జరిగాయి. ఇందులో పాల్గొన్న ఆయన ప్రసంగిస్తూ, భారతీయ జనతా పార్టీ ఒక మతవాద పార్టీ, మతోన్మాదంతో కూడిన పార్టీ కావడం వల్లే తాము ఆ పార్టీ సారథ్యంలోని కూటమి నుంచి బయటకు వచ్చినట్టు చెప్పారు. కోట్లాది రూపాయల వ్యయంతో రైల్వే స్టేషన్లను ఆధునికీకరిస్తున్నట్టుగా మోదీ ప్రచారం చేస్తున్నారని, నిజానికి ఉన్న పాత స్టేషన్ భవనాలకు కొత్తగా పెయింట్ వేస్తున్నారన్నారు. ఇందుకోసం ప్రజాధనంతో ప్రధాని మోదీ పబ్లిసిటీ చేసుకుంటున్నారని ఆయన ఆరోపించారు.





శ్రీపెరుంబుదూరులోని రామానుజర్ ఆలయ దర్శనానికి వచ్చిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్‌కు ఆలయం వద్ద స్వాగతం పలుకుతున్న అర్చకులు - లోకేశ్‌కు స్వామివారి పటం అందజేస్తున్న ఆలయ అధికారులు



చెన్నై కలైవానర్ అరంగంలో ఏర్పాటైన సభలో మిచౌంగ్ తుఫానుకు నష్టపోయిన చెన్నై, చెంగల్పట్టు, తిరువళ్లూరు జిల్లాలకు చెందిన జాలర్లకు ఆర్థిక సాయం అందిస్తున్న మంత్రి ఉదయనిధి

ప్లాస్టిక్‌పై స్కూల్ విద్యార్థులకు అవగాహన

అడయార్, ఫిబ్రవరి 27: సన్‌ఫీస్ట్ ఇప్పీ పర్యావరణ సుస్థిరత దిశగా సాహసోపేతమైన ముందడుగు వేసింది. ఇందులో భాగంగా 'ఇప్పీ : బెటర్ వరల్డ్ ప్రోగ్రాం' పేరుతో ప్లాస్టిక్‌పై పాఠశాల విద్యార్థుల్లో అవగాహన కల్పించే కార్యక్రమం చేపట్టింది. నగరంలోని దాదాపు 400 పాఠశాలలకు చెందిన 2.5 లక్షల మంది విద్యార్థులు పాల్గొన్నారు. వే ఫర్ లైఫ్ ఎన్జీవో, విథై రిసైక్లింగ్ అనే సంస్థలతో కలిసి ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. విద్యార్థుల మధ్య చర్చాగోష్ఠిలను నిర్వహించి, ప్లాస్టిక్ వ్యర్థాలను పారేయడం, రీసైక్లింగ్ ప్రాధాన్యంపై విద్యార్థుల్లో అవగాహన కల్పించే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా 21,600 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. ఇందులో నగరంలోని రాణి మెయ్యమ్మై బాలిక హయ్యర్ సెకండరీ స్కూల్‌తో పాటు అనేక పాఠశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చర్చాగోష్ఠిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను నిర్వాహకులు అభినందించారు.



చిన్నారులను అభినందిస్తున్న నిర్వాహకులు

500 ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలు

● టెండర్లను ఆహ్వానించిన ఎంటీసీ

అడయార్, ఫిబ్రవరి 27: నగర రవాణా సంస్థ (ఎంటీసీ) కొత్తగా 500 ఎయిర్ సస్పెన్షన్‌తో కూడిన ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేయనుంది. ఇందుకోసం టెండర్లను కూడా ఆహ్వానించింది. చెన్నై నగరంలో ఎంటీసీ బస్సులు 659 రూట్లలో 3,436 సిటీ బస్సులు తిరుగుతున్నాయి. నగరంలోని 32 డిపోల నుంచి నడిపే ఈ బస్సుల్లో ప్రతి రోజూ 33.60 లక్షల మంది నగర వాసులు రాకపోకలు సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో నానాటికీ పెరిగిపోతున్న నగర జనాభాకు అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచాలని ఎంటీసీ నిర్ణయించింది. ఇందుకోసం దశల వారీగా బస్సులను కొనుగోలు చేస్తుంది. ఈ పరిస్థితుల్లో 500 ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా, ఇప్పటికే 100 బస్సుల కొనుగోలుకు టెండర్లను ఆహ్వానించింది. తాజాగా, మరో 3 వేల బస్సులు, 500 ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలు చేయనున్నట్టు బడ్జెట్‌లో ప్రకటించారు. దీంతో ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలుకు టెండర్లను ఆహ్వానించారు. ఈ విషయంపై ఎంటీసీ ఉన్నతాధికారి మాట్లాడుతూ... నగర శివారు ప్రాంతాల్లో జనాభాతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు పెరుగుతున్నాయన్నారు. ఈ ప్రాంతాల్లో ప్రజా రవాణాను కల్పించేందుకు వీలుగా బస్సుల సంఖ్యను పెంచాలని నిర్ణయించి, కొత్త బస్సులను కొనుగోలు చేయాలని నిర్ణయించినట్టు పేర్కొన్నారు.